**బాలమిత్ర, జి. రామలక్ష్మి - హైదరాబాదు**

## భజన విలువ

బాబా భక్తులలో శ్రీకాంత్ - లక్ష్మి అనే దంపతులు ఉన్నారు. వారు అధిక సంపన్నులు. షిరిడీకి కొద్ది దూరంలో వున్న మరో ఊర్లో ఉంటారు. తరుచూ షిరిడీకి వచ్చి, బాబాని దర్శించుకుని వెళ్తుంటారు. ఒకసారి అలాగే వచ్చారు దర్శనార్థం కారులో అది భజన ప్రారంభించబోయే సమయం. తీరా వారు వచ్చి బాబాని దర్శించి, మాట్లాడి పులూ, పళ్ళూ సమర్పించేసరికి భజన ఆరంభమయింది. శ్రీకాంత్, లక్ష్మిని కంగారుపెట్టసాగాడు. "పోదాం పద. అవతల అర్జంటు పనిమీద ఓ వ్యక్తిని కలుసుకోవాల్సి వుంది" అంటూ.

"వద్దు. భజన అయినాక తీర్థ ప్రసాదాలు తీసుకుని మరీ వెళదాం" అంది లక్ష్మి.

"ఆ ... భజన అయ్యేసరికి ఓ గంట, తీర్థప్రసాదాలు ఇంతమందికీ అందేసరికి మరో గంటా అవుతుంది. రెండు గంటల టైము ఇక్కడ గడిపేకన్నా నాకు అవతల పనే ముఖ్యం. ఆ మనిషి కాస్తా వెళ్ళిపోతాడు ఈలోగా" అంటూ కంగారుపెడ్తూంటే, మధ్యలో బాబా కల్పించుకుని "భజనకి ఉండి ప్రసాదాలు పుచ్చుకునే వెళ్ళండి నాయనా, అవతల వ్యక్తి ఏం వెళ్ళిపోడు, ఉంటాడు నీ గురించి" అన్నారు.

అయినా అతను "లేదు బాబా! వెళ్ళాలి" అన్నాడు.

"సరే నీ ఇష్టం. నాకు ప్రియాతిప్రియమైన భజన - హారతి చూడకుండానే వెళ్ళాలనుకుంటే అలాగే వెళ్ళు. నీకు టైము ముఖ్యం కదా" అన్నారు నవ్వుతూ.

మరోసారి బామాకి నమస్కరించి శ్రీకాంత్ భార్యతో సహా కలిదిపోయాడు. తన బిజినెస్‌కి అవతల వ్యక్తి పది లక్షల కాంట్రాక్ట్ యిస్తానన్నాడు. అదీ అతని ఆరాటం. అప్పటికే బాగా చీకటి పడిరది. కొంత దూరం పోగానే చిన్న అడవి వచ్చింది. అక్కడ కారు పంచరయి ఆగిపోయింది. ఆ చీకట్లో కారుని రిపేరు చేసుకుని టార్చిలైటు సాయంతో బయలుదేరే సరికి రాత్రి పదయింది. ఆ కలుసుకుంటానన్న వ్యక్తి ఇచ్చిన సమయం దాటిపోయినా, యింకా వేచియుండి, చూసి చూసి విసుగెత్తి అప్పుడే వెళ్ళిపోవటం జరిగింది.

శ్రీకాంత్ ఆ సంగతి తెలుసుకుని ఉస్సూరుమన్నాడు. అప్పుడు లక్ష్మి అంది, "బామా భజనని నిరాకరించారు! ఆయన మాటని త్రోసిపుచ్చి వచ్చినందుకు సమయమూ దాటిపోయింది. పనీ అవలేదు.

అవతల భజనా చూడలేకపోయాం. ఇంకెప్పుడూ ఇలా చేయకండి. భజన విలువ తెలుసుకోండి ఇకనయినా" అంది మందలిస్తూ.

శ్రీకాంత్ తన తప్పిదాన్ని తెలుసుకుని మనసులోనే బాబాని క్షమాపణలు కోరి, "బాబా, అతనిని నాకు కలపండి, ఈసారి భజనకు రావటమే కాదు, ఆ ఖర్చులన్నీ నేనే భరిస్తాను" అని అనుకున్నాడు. ఆ మర్నాడు ఆ వ్యక్తి శ్రీకాంత్ ఇంటికే వచ్చి పని ముగించుకుని వెళ్ళాడు. శ్రీకాంత్ ఆనందంగా బాబాని చేరి తన కోరిక తీర్చుకున్నాడు. 'భజన విలువ' అనుభవించి వారికే తెలుస్తుంది మరి.